# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ అత్యున్నత పౌర పురస్కారలైన పద్మా అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రదానం చేశారు.
- ❖ వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రను పోషించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు.
- ❖ భారతదేశం విద్యా రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- ❖ వచ్చే జూన్ నుండి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.

======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2025 సంవత్సరానికి గాను రెండవ విడత పద్మ పురస్కారాలను ఈరోజు ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్ లో ఘనంగా జరిగిన ఈ వేడుకలో 68 మంది ప్రముఖులు పద్మా పురస్కారాలను అందుకున్నారు. వీరిలో ముగ్గురికి పద్మ విభూషణ్, 9 మందికి పద్మ భూషణ్, 56 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రదానం చేశారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జగదీష్ సింగ్ ఖేహర్, కుముద్ని రజనీకాంత్ పద్మ విభూషణ్ అవార్డులను అందుకున్నారు, ప్రముఖ జానపద గాయని శారదా సిన్హాకు మరణానంతరం పద్మ విభూషణ్ అవార్డులను ప్రకటించారు. పద్మశ్రీ అవార్డు పొందిన వారిలో మంద కృష్ణ మాదిగ, డాక్టర్ నీర్జా భట్ల, వి.రాఘవేంద్ర చార్య, ప్రొఫెసర్ కె.ఎల్.కృష్ణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా గత నెల 28న మొదటి విడతగా 71 మందికి పద్మా అవార్డలను ప్రధానం చేశారు.

======================

వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రను పోషించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని 5 వేల 536

కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు  చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ఆపరేషన్ సింధూర్‌పై మాట్లాడుతూ.. భారతదేశం ఎవరితోనూ శత్రుత్వాన్ని కోరుకోదని, శాంతియుతంగా జీవించాలని కోరుకుంటుందన్నారు. ప్రపంచ సంక్షేమానికి దోహదపడే విధంగా దేశం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తుందన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్థాన్ ఉగ్రదాడులతో భారత్‌లో అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తే ఉపేక్షించబోమని నరేంద్రమోదీ హెచ్చరిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు- CBDT ఆదాయపు పన్ను రిటర్న్స్ (ITRలు) దాఖలు చేయడానికి చివరి తేదీని జులై 31 నుండి సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. ఈ పొడిగింపు ITR ఫారమ్‌లలో గణనీయమైన సవరణలకు TDS క్రెడిట్ కారణంగా ప్రజలకు ఎక్కువ సమయాన్ని అందిస్తుందని తెలిపింది. ఈ గడువుతో పన్నుదారులు లేవనెత్తిన ఆందోళనల తగ్గి, సమ్మతి కోసం తగిన సమయాన్ని అందిస్తుందని, తద్వారా రిటర్న్ దాఖలు ప్రక్రియ సమగ్రత, ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం విద్యా రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... జాతీయ విద్యా విధానం భారతదేశంలో అభ్యాస భవిష్యత్‌ను రూపొందించే దార్శనిక చట్రంగా ఉద్భవించిందన్నారు. సాంప్రదాయ విలువలను కాపాడుతూ జాతీయ విద్యా విధానం 2020 దేశంలో విద్య భవిష్యత్‌ను ప్రభావితం చేసే చట్రంగా అభివృద్ధి చెందిందన్నారు. విద్య రంగంలో మౌలిక సదుపాయాలు, సమ్మిళితత్వం, ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేక  దృష్టి సారించిందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 15 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం జన ఔషధి కేంద్రాలను మూసివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి వి.సోమన్న ఈరోజు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. 15 సంవత్సరాలకు పైగా రాష్ట్రంలోని జన ఔషధి కేంద్రాలు ప్రజలకు సరసమైన ధరల్లో మందులు, శస్త్రచికిత్స వస్తువులను అందిస్తున్నాయని పేర్కొంటూ...  ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది పేదల వ్యతిరేక నిర్ణయమని, ప్రజా సంక్షేమానికి వ్యతిరేకంగా అలాంటి నిర్ణయం తీసుకోవడానికి కారణమైన పరిస్థితుల గురించి ప్రశ్నించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం వర్షాకాలంలో 'సాధారణం కంటే ఎక్కువ' వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఈరోజు న్యూ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో భౌగోళిక శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ మాట్లాడుతూ... వచ్చే జూన్ నుండి సెప్టెంబర్ వరకు, వాయువ్య మరియు తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కాలంలో రుతుపవన వర్షాలు దీర్ఘకాలిక సగటులో 106 శాతం ఉండే అవకాశం ఉందని ఆయన వెల్లడిస్తూ ...

(వాయిస్ 26 సెకన్లు)

"సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం వ్యవసాయం, నీటి వనరులకు ప్రయోజనాలను చేకూరుస్తుందని కానీ వరదలు, రవాణాకు అంతరాయాలు, ప్రజారోగ్య సమస్యలు, పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగించే ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. ఈ ప్రమాదాలను పరిష్కరించడానికి, IMD ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఉపయోగించుకోవాలన్నారు.

=======================

ఉగ్రవాదానికి మద్దతుగా పాకిస్థాన్ చర్యలను భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా బహిర్గతం చేస్తోంది. అఖిల పక్ష బృందాల ప్రతినిధులు వివిధ దేశాలను సందర్శించి ఉగ్రవాదం పట్ల భారతదేశపు జీరో టాలరెన్స్ విధానాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు శశి థరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధిల బృందం ఈరోజు దక్షిణ అమెరికా దేశమైన గయానాలో పలువురితో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ఎంపీ శశి థరూర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉగ్రవాద దాడులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గయానా భారతదేశానికి మద్దతు ఇచ్చిందన్నారు.

(వాయిస్ 34 సెకన్లు)

అదే విధంగా జేడీ(యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని మరో అఖిలపక్ష ప్రతినిధి బృందం సింగపూర్ విదేశాంగ, హోం వ్యవహారాల సీనియర్ సహాయ మంత్రితో సమావేశమయ్యింది. అనంతరం సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ... పాకిస్తాన్‌ను ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ బ్లాక్ లిస్ట్‌లోకి తీసుకురావాలని కోరారన్నారు.

=======================

అమెరికా విద్యా సంస్థల్లో చదివే భారతీయులతో సహా విదేశీ విద్యార్థులు ఎవరైనా తరచుగా తరగతులకు గైర్హాజరు అయితే వీసాను రద్దు చేయనున్నామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఈరోజు ఓ ప్రకటన జారీ విడుదల చేసింది. అమెరికాలోని విద్యాసంస్థ నుంచి డ్రాపౌట్ అయినా, తరగతులకు హాజరుకాకపోయినా.. విద్యాసంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా విదేశీ విద్యార్థులకు వీసా రద్దవుతుందని పేర్కొంది. భవిష్యత్‌లో కూడా ఆ దేశం నుంచి ఎలాంటి వీసా లభించదని ప్రకటించింది.

=======================

ఉక్రెయిన్ ఈశాన్య సుమీ ప్రాంతంలోని నాలుగు సరిహద్దు గ్రామాలను రష్యా స్వాధీనం చేసుకుందని అధికారులు పేర్కొన్నారు. సుమీలో గ్రామాలను ఆక్రమించుకుంటూ రష్యన్ దళాలు మరింత ముందుకు సాగడానికి ప్రయత్నిస్తున్నాయని ఆ ప్రాంత సైనిక పరిపాలన అధిపతి ఒలేహ్ హ్రిహోరోవ్ వెల్లడించారు. వారిని ఎదుర్కోవడానికి తమ దళాలు తీవ్రంగా పోరాడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం మాస్కో స్వాధీనం చేసుకున్న గ్రామాల ప్రజలను ఇప్పటికే అక్కడి నుంచి ఖాళీ చేయించామని తెలిపారు.

=======================
=======================